క్లుప్తంగా

నివాళులర్పించిన ఎమ్మెల్యే



ఐనవోలు : నందనం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు యాకర సాంబయ్య తండ్రి యాకర ఐలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సోమవారం ఐలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ శేఖర్ రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు సంపత్‌గౌడ్, నాయకులు రాజు, బుచ్చిరెడ్డి, రాకేష్‌రెడ్డి, మండల సత్యం పాల్గొన్నారు.

చైర్మన్‌ను మార్చాలి

వేలేరు : రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఎస్సీ వర్గీకరణ కమిటీ చైర్మన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని తొలగించి ఎస్సీ వర్గాలకు చెందిన నాయకుడిని నియమించాలని బీఆర్ఎస్ మండల నాయకుడు కొయ్యడ మహేందర్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి కపటప్రేమ చూపిస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ కమిటీ చైర్మన్‌గా ఎస్సీ నాయకుడిని కాకుండా అగ్రవర్ణాలకు చెందిన ఉత్తమ్‌కుమార్ రెడ్డిని నియమిస్తే దళితులకు న్యాయం జరుగుతుందా అని ఆయన ప్రశ్నించారు.

నియామకం



వేలేరు : బీఆర్ఎస్ పార్టీ మండల కోఆర్డినేటర్‌గా మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన గొవింద సురేష్ నియామకమయ్యారు. మండలంలోని పార్టీ బలోపేతానికి తనవంతుగా కృషిచేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విశ్వకర్మ యజ్ఞం

హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి రోడ్డులోని శ్రీమద్విరాట్ పోతులూరి గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర దేవాలయంలో మంగళవారం ఉదయం 11గంటలకు విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు మారేడోజు సదానందచారి తెలిపారు. భక్తులు పూజలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మడికొండలో..

మడికొండ: కాజీపేట మండలం మడికొండలో విశ్వకర్మ మహాయజ్ఞాన్ని మంగళవారం నిర్వహిచనున్నట్లు మడికొండ శ్రీజగత్ మహాముసీశ్వర విశ్వకర్మ సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు కడార్ల పూర్ణచందర్ మాట్లాడుతూ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉన్న విశ్వకర్మ సంఘం భవనంలో నిర్వహించనున్న యజ్ఞంలో విశ్వకర్మలు పాల్గొని విజయవంతం చేయలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఉద్దండి చంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శి కందుకూరి బాలరాజు, కడార్ల సతీష్, కడార్ల దుర్గారావు, అలుగోజు సత్యనారాయణచారి, కడార్ల నరేందర్, చెంగెల్లి సత్యనారాయణ, తాటికొండ బేరింగ్ రమేష్, పత్తిపాక పరమేశ్వరచారి, రంగు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం



హన్మకొండ: హనుమకొండ మండలం పలివేల్పుల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు వెనిశెట్టి రవికుమార్ జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. ఉపాధ్యాయుడిగా తమ వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తూనే ప్రవృత్తిగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా గుజరాత్ రాష్ట్రానికి చెందిన శిక్షా సాగర్ ఫౌండేషన్ హేమాచంద్రచార్య జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి రవికుమార్ ఎంపికయ్యారు. గుజరాత్‌లోని పఠాన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శిక్షాసాగర్ వ్యవస్థాపక అధ్యక్షుడు శైలేష్ కుమార్ ప్రజాపతి, నసీమాభాను చేతుల మీదుగా రవికుమార్ అవార్డు అందుకున్నారు.

గణనాథుడి కల్యాణం

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురి కాలనీలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో సిద్ధి, బుద్ధి సమేత గణనాథుడి కల్యాణ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో దేవతామూర్తుల వివాహ వేడుకలను అర్చకులు కనులపండుగగా జరిపించారు. గణపతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 16 రోజులుగా సాగుతున్న హోమానికి అర్చకులు పూర్ణాహుతి పలికారు. కార్పొరేటర్ రవీందర్ యాదవ్, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ, ఆలయ పరిపాలన అధికారి సాయికృష్ణ శర్మ, దేవులపల్లి సదానందం, శనిగరపు రాజ్‌మోహన్, తుమ్మ శ్రీనివాస్, గంగుల రాజిరెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గణపయ్య

నవరాత్రులు భక్తిశ్రద్ధలతో గణపయ్యకు పూజలు చేసిన భక్తులు సోమవారం నిమజ్జన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆత్మకూరు, కమలాపూర్, ఎల్కతుర్తి, ధర్మసాగర్, వేలేరు, పరకాల, నడికూడ, శాయంపేట, దామెర, ఐనవోలులో నిమజ్జన వేడుకలు అంబరాన్నంటాయి. నిర్వాహన కమిటీ, భక్తుల నృత్యాలు, కేరింతల నడుమ శోభాయాత్ర కొనసాగింది. పోలీస్‌లు భారీ బందోబస్తు నిర్వహించారు. అధికారులు నిమజ్జన ప్రదేశాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు.

\- సాక్షి నెట్‌వర్క్

ఆత్మకూరు : కటాక్షపూర్ చెరువులో నిమజ్జనమవుతున్న గణనాథుడు





శాయంపేట : వినాయకుడి నిమజ్జనానికి శోభాయాత్రగా బయలుదేరిన భక్తులు



శాయంపేట : వినాయకుడి ప్రతిమతో చిన్నారులు



ఎల్కతుర్తి : భీమదేవరపల్లిలో ఊరేగింపు



పరకాల : గణేశుడిని ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్న భక్తులు



ధర్మసాగర్ : వినాయకుడి ఊరేగింపులో..



పరకాల : గణపయ్యను నిమజ్జనం చేస్తూ..



శాయంపేట : ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



కమలాపూర్ : నృత్యాలు చేస్తున్న చిన్నారులు



శాయంపేట : చెరువు వద్ద సిద్ధంగా ఉన్న అంబులెన్స్



ఐనవోలు : గణపతి పూర్ణాహుతిలో పాల్గొన్న ఈఓ నాగేశ్వర్‌రావు దంపతులు



ఆత్మకూరు : నిమజ్జన వేడుకల్లో అధికారులు



ఐనవోలు : నిమజ్జనానికి విగ్రహాన్ని తీసుకెళ్తున్న అర్చకులు, సిబ్బంది



పరకాల : చలివాగులో నిమజ్జనం చేస్తూ..



ఆత్మకూరు : శోభాయాత్రలో చిన్నారుల నృత్యాలు

సైన్స్ సెంటర్‌లో ఘనంగా ఓజోన్ డే



కాజీపేట అర్బన్ : విజేతలతో అతిథులు



హసన్‌పర్తి : ప్రశంసపత్రం అందుకున్న హర్షిణి

కాజీపేట అర్బన్: ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా హనుమకొండ హంటర్ రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో సోమవారం ఓజోన్ డే నిర్వహించారు. నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పెరుగు శ్యామ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానవాళి మనుగడకు ఓజోన్ పొర ఎంతో దోహదపడుతోందని అన్నారు. ఓజోన్ పొర పరిరక్షణపై అందరూ సహకరించాలని కోరారు. ఓజోన్ డే సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రీజినల్ సైన్స్ సెంటర్ ఫీల్డ్ అసిస్టెంట్ సాయిని అశోక్‌కుమార్, సైన్స్ ఆఫీసర్ కట్ల శ్రీనివాస్, సైన్స్ సెంటర్ ఆఫీసర్ శ్రీనివాసస్వామి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఈర్ల రాకేష్, సురేష్‌బాబు, కృష్ణారెడ్డి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచనలో విద్యార్థి ప్రతిభ

హసన్‌పర్తి: అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలకు చెందిన కె.హర్షిని పాల్గొని ప్రతిభ కనబరిచారు. జిల్లాస్థాయి తృతీయ బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట రాంబాబు తెలిపారు. ఆ విద్యార్థికి నిట్ ప్రొఫెసర్ పెరుగు శ్యామ్, సైన్స్ సెంటర్ అధికారి శ్రీనివాసస్వామి ప్రశంస పత్రం అందజేసి అభినందించారు.

ఈద్గాలో మిలాద్ - ఉన్ - నబీ

ఖిలా వరంగల్: మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఈద్గా ప్రాంగణంలో తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎంఏ.జబ్బార్ ఆధ్వర్యంలో మిలాద్ - ఉన్ - నబీ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎండీ.చాంద్ పాషా, సయ్యద్ అర్ఫత్ అలీ, మహ్మద్ అఫీజొద్దీన్, సయ్యద్ రబ్బానీ, దస్తగిరి, హసన్ అలీబేగ్, అశ్రఫ్, మాసూక్ అలీ, జానీబాయ్, ముగ్దుం, మసూద్, అమ్జద్, వహిద్, మౌలానా సఫియొద్దీన్, మహ్మద్ రజాక్, ఎండి.రఫీక్, పర్వత మల్లేశం పాల్గొన్నారు.



ఈద్గా మసీదులో అన్నదానం చేస్తున్న జబ్బార్

నేడు ప్రజానాట్య మండలి బహిరంగ సభ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాధ్యులు

వరంగల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 17న పోచమ్మమైదాన్ మైదానం (రత్న హోటల్ ఎదురు)లో ప్రజానాట్య మండలి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రజానాట్య మండలి వరంగల్ జిల్లా కార్యదర్శి వలదాసు దుర్గయ్య తెలిపారు. పోచమ్మ మైదాన్‌లోని కళాభవన నిర్మాణ స్థలంలో సభ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాటలు, వీధి నాటికలు మొదలగు కళారూపాల ద్వారా ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 17న విలీనం, విద్రోహం, విమోచన అనే పేరు తోటి రకరకాల వాదనలు జరుగుతున్న సందర్భంలో వాస్తవ చరిత్రను తెలియజెప్పాలనే ఉద్దేశంతో బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 17న వరంగల్‌కు బస్సుయాత్ర చేరుకుంటుందని, సాయంత్రం పోచమ్మమైదాన్‌లో ముగింపు సభ జరుగుతుందన్నారు. కవులు, కళాకారులు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

కానిస్టేబుల్ ఔదార్యం

హసన్‌పర్తి: అర్ధరాత్రి ఆపదలో ఉన్న బాధితులకు తన బైక్ ఇచ్చి ఓ కానిస్టేబుల్ తన ఔదార్యం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆ కానిస్టేబుల్‌కు ఆ కుటుంబ సభ్యులు సోమవారం బైక్ తిరిగి ఇచ్చి థ్యాంక్స్ చెప్పి సన్మానించారు. వివరాల్లోకి వెళ్లితే హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామ పంచాయతీ కారోబార్ చాతళ్ల సదానందం కుమార్తె ప్రతిభ జ్యోత్స్న.. రంగారెడ్డి జిల్లాలోని గొలిదొడ్డి గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. శనివారం ఔటింగ్ ఉండడంతో భార్య జ్యోత్స్న, పెద్ద కుమార్తె సాత్వికతో కలిసి సదానందం రైల్‌లో హైదరాబాద్ వెళ్లి తిరుగు ప్రయాణంలో కాజీపేటలో రైలు దిగారు. తన బైక్‌పై పెంబర్తికి వెళ్తుండగా మార్గమధ్యలోని వడ్డెపల్లి చెరువు సమీపంలో బైక్ చెడిపోయింది. అప్పటికే అర్ధరాత్రి దాటింది. ఆ సమయంలో కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్న కానిస్టేబుల్ పరకాల చలపతి వారిని గమనించాడు. వారి వద్దకు వెళ్లి విషయం అడిగి తెలుసుని తన బైక్‌ను వారికి ఇచ్చి పంపించారు. దాంతో చలపతికి వారు కృతజ్ఞతలు తెలిపారు.



కానిస్టేబుల్‌కు కృతజ్ఞత చెబుతున్న సదానందం

కొనసాగుతున్న ఆధార్ కేంద్రం



మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సెంటర్ నిర్వాహకులు సూచించారు. కొత్త ఆధార్ కార్డు, ఆధార్‌లో తప్పుల సవరణ, పుట్టిన తేదీలో మార్పులు, మొబైల్ నంబర్ లింక్, చిరునామాలో మార్పులు, చేర్పులకు ఆధార్ కేంద్రంలో లేదా 9494 729272 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



రామన్నపేట: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని 24వ డివిజన్‌లో గణపతి మండపంలో పారిశుద్ధ్య కార్మికులు చేసిన సేవలను గుర్తించి ఓరుగల్లు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారిని సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఆకారపు మోహన్, పాల రాకేశ్, యూత్ అధ్యక్షులు సంగినేని రాజీవ్, సత్యబోయిన జగదీష్, సుశీల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజు

ఎల్కతుర్తి : నేడు నిర్వహించే ప్రజాపాలన దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలుగూరి రాజు పిలుపునిచ్చారు. సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో విలేకరులతో మాట్లాడారు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు నాడు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఆదారి రవీందర్, మాచర్ల సదానందం, మురళి, సురేష్, రవి, ప్రకాశ్, వెంకటేశ్వర్లు, జేమ్స్, మధు, కొమురయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు రాజు

ఓజోన్‌పొరను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ఆచార్య కోమల్‌రెడ్డి

ధర్మసాగర్ : ఓజోన్‌పొరను కాపాడుకోవాలని ఆచార్య కోమల్‌రెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం పురస్కరించుకొని 'నన్ను రక్షించండి నేను మిమ్మల్ని రక్షిస్తాను' అనే అంశంపై హనుమకొండలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల కళాశాలలో ప్రిన్సిపాల్ ఇందుమతి అధ్యక్షతన పర్యావరణ పరిరక్షణ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆచార్య కోమల్‌రెడ్డి మాట్లాడుతూ.. మన కంటికి కనిపించే దృశ్య శక్తితో పాటు అధిక శక్తివంతమైన జీవరాశికి హాని కలిగించే అతినీల లోహిత కిరణాలు ఉంటాయని తెలిపారు. వీటిని భూమికి చేరకుండా ఓజోన్ పొర అడ్డుకుంటుందని, గ్రీన్ హౌస్ వాయువుల పెరుగుదల వలన ఓజోన్ పొరకు రంధ్రాలు పడుతున్నాయని, దీన్ని పరిరక్షించుకోవాలని అన్నారు. అనంతరం విశ్రాంత అటవీ శాఖ అధికారి పురుషోత్తం మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన పర్యావరణం అభివృద్ధి చెందుతున్న సమాజానికి పునాది వంటిదన్నారు. యూరప్ దేశాలు పర్యావరణ సూచిలో మొదటి 20 స్థానాల్లో ఉంటే, భారత్ ప్రపంచ దేశాల్లో 176 స్థానంలో ఉందని రాష్ట్ర పర్యావరణ విభాగం కన్వీనర్ ధర్మ ప్రకాశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్, అశోక్, నరసింహ, సాంబయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

- మిషన్ భగీరథ పనులతో ధ్వంసం
- నడవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- శిథిలమైన సైడ్ డ్రెయినేజీలు

మడికొండ: గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ అంబేడ్కర్ విగ్రహం పక్క వార్డులో 25 ఏళ్ల క్రితం నిర్మించిన సీసీ రోడ్డుపై కంకర తేలి కాలనీవాసులు నడవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్ ఉన్న సమయంలో సీసీ రోడ్డు నిర్మాణానికి టెండర్లు వేశారు. ఇప్పటి వరకు మూడేళ్ల అవుతున్నా అతీగతి లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.

ముందుకు సాగని మురుగు

అలాగే కాలనీలోని సైడ్ డ్రెయినేజీలు సైతం శిథిలమయ్యాయి. దీంతో మురుగు నీరు సరిగా వెళ్లడం లేదు. ఖాళీ స్థలాలు, మురుగు కాల్వల్లోని నీటిలో పందులు స్వైర విహారం చేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం పడితే నీరు మొత్తం రోడ్డుపై పారుతోందని చెబుతున్నారు. మిషన్ భగీరథ పనులతో రోడ్లు గుంతలు పడ్డాయని వాపోతున్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు స్పందించి సీసీ రోడ్డు, మురుగునీటి కాల్వ నిర్మాణం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





ధ్వంసమైన సైడ్ డ్రెయినేజీలు



కంకర తేలిన సీసీ రోడ్డు

సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలి



కాలనీలో వేసిన సీసీ రోడ్డు గతంలోనే కాలం చెల్లిపోవడంతో కంకర తేలింది. సైడ్ డ్రెయినేజీ కూలి పోవడంతో నీరు సరిగా వెళ్లడం లేదు. వెంటనే సీసీరోడ్డు, సైడ్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలి. ఎమ్మెల్యే నాగరాజు, అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి.

\- దార ధనుంజయ్, స్థానికుడు

బీజేపీ ఎస్సీ మోర్చా కార్యవర్గం ఎన్నిక

హన్మకొండ: బీజేపీ ఎస్సీ మోర్చా హనుమకొండ జిల్లా కార్యవర్గాన్ని నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ మోర్చా హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులుగా కోవెల జీవన్ ప్రకాశ్, జి.కృష్ణారావు, జి.శ్రీనివాస్ రావు, అంబాల ప్రతాప్, బర్ల నవీన్, మాదారపు సోమశేఖర్, ప్రధాన కార్యదర్శులుగా మేకల హరిశంకర్, బత్తుల వినయ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. కార్యదర్శులుగా బైరపాక వెంకటేష్, దాసరి సదానందం, పసుల శ్రీకాంత్, బొచ్చు శ్రీనివాస్, వస్కుల కమలాకర్, నల్లపు శివకృష్ణ, కోశాధికారిగా మార్త రాజేంద్రప్రసాద్, కార్యాలయ కార్యదర్శిగా మట్టెడ సుమన్, అధికార ప్రతినిధులు మేకల అంబేడ్కర్, కోట మనోజ్, అలువాల కుమారస్వామి, లవన్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా గడ్డం కిషన్, ములుగు సంపత్, వేల్పుల సుధాకర్, మేదరి పోచారం, కె.అరవింద్, కె.నరేష్‌ను నియమించినట్లు వివరించారు.